క్లుప్తంగా

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు



కె.వెంకటాపురంలో బ్లీచింగ్ జల్లుతున్న కార్మికుడు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు చేపట్టారు. డ్రైనేజీలు, మురుగునీరు నిలువ ఉన్న చోట బ్లీచింగ్ జల్లారు. ఈ సందర్భంగా సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇంటి పరిసరాలలో నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

అందుబాటులో ఎరువులు, విత్తనాలు



మాట్లాడుతున్న వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు

మునగపాక: రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు తెలిపారు. వాడ్రాపల్లి ఆర్బీకేలో శుక్రవారం రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్బీకేల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీఏఏ తులసీ మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల వినియోగం ద్వారా మెరుగైన దిగుబడి, ఆదాయం సాధించవచ్చన్నారు.

తుది దశకు భూరక్ష కార్యక్రమం



సర్వే చేస్తున్న సిబ్బంది

ఎస్.రాయవరం: జగనన్న భూ రక్ష కార్యక్రమం భీమవరం గ్రామంలో తుది దశకు చేరుకుంది. సర్వే రాళ్ల పాతేందుకు తహసీల్దార్ విజయకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ త్రిమూర్తి,వైఎస్సార్ సీపీ నాయకులు గరగా శ్రీనువాసరావు రెవెన్యూ సిబ్బంది, రెవెన్యే అధికారులు ఉన్నారు.


ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న నెట్టెం సత్యనారాయణ

రాంబిల్లి: మామిడివాడ గ్రామదేవత పైడితల్లమ్మ ఆలయ నిర్మాణానికి మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు నెట్టెం సత్యనారాయణ రూ.లక్ష అందజేశారు. భక్తుల విరాళాలతో పైడితల్లమ్మ నూతన ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధి కన్నం రమణారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు సంఘీభావం తెలిపిన యువత



గిరిజనుల దీక్షలో సీపీఎం నాయకులతో పాటు కూర్చున్న యువకులు

కోటవురట్ల: సమస్యల పరిష్కారం కోరుతూ గిరిజనులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షకు యువకులు సంఘీభావం తెలిపారు. తంగేడుకు చెందిన కె.శ్రీహరిరాజు అనే యువకుడు తన జన్మదిన వేడుకను దీక్షా శిబిరంలో జరుపుకొని, తన స్నేహితులతో కలిసి గిరిజనులకు సంఘీభావంగా కూర్చున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి జి.డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



నాగులాపల్లిలో నిర్వహిస్తున్న ర్యాలీ



ఖాజీపాలెంలో తల్లి పాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న సర్పంచ్ నర్సింగరావు



పంచదార్లలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

మునగపాక: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని నాగులాపల్లి సర్పంచ్ జామి చినమ్మలు తెలిపారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నాగులాపల్లిలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఆరు నెలల వయస్సు వచ్చేంతవరకు పిల్లలకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మళ్ల కాశీసురేష్,పంచాయతీ కార్యదర్శులు నరసింగరావు,నాగేశ్వరరావు,ఏఎన్ఎంలు గుణలక్ష్మి,పద్మ, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక విక్టోరియా, అంగన్‌వాడీ టీచర్లు,ఆశ కార్యకర్తలు,టాటా ట్రస్ట్ నిర్వాహకులు భాగ్యలక్ష్మి,అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ఖాజీపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో విజయవాహిని సంస్థ సహకారంతో ఆసియన్ పెయింట్స్ ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిలా నర్సింగరావు మాట్లాడుతూ తల్లి పాలతో పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు.ఎంపీటీసీ ధనలక్ష్మి,వీసీఎఫ్ మేనేజర్ సాయి చరణ్,హారిక, ఉషారాణి,శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి: పంచదార్ల, ధార భోగాపురం గ్రామాల్లో శుక్రవారం విజయవాహిని సంస్థ ఆధ్వర్యంలో తల్లి పాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి పాలు ప్రాధాన్యతపై అంగన్‌వాడీ వర్కర్లు, పోషణ సఖిలు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పోషణ సఖి దేవి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంట లోపు తల్లి పాలు పట్టాలన్నారు. ఆరు నెలలు వరకు తల్లి పాలు బిడ్డకు తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు.

త్వరితగతిన జల్‌జీవన్ పనులు

పాయకరావుపేట మండల సమావేశంలో కోరిన సభ్యులు



మండల పరిషత్ సమావేశానికి హాజరైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు



ఇళ్ల నిర్మాణంపై వివరిస్తున్న హౌసింగ్ డీఈ విజేయుడు

పాయకరావుపేట: గ్రామాల్లో చేపట్టిన జల్‌జీవన్ పనులు మరింత వేగవంతం చేయాలని సభ్యులు కోరారు. ఎంపీపీ ఇసరపు పార్వతి అధ్యక్షతన శుక్రవారం పాయకరావుపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. తమ ప్రాంతాల్లో చేపట్టవలసిన పనులు, సమస్యలను పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. పాల్తేరు ఎంపీటీసీ ఇసరపు సత్యనారాయణ మాట్లాడుతూ జల్‌జీవన్ పనులు వేగవంతం చేయాలని కోరారు. పాల్మన్‌పేటలో ఇళ్ల నిర్మాణానికి రుణాలు మంజూరు చేయాలని సర్పంచ్ కోడ కోటేశ్వరరావు, అంకంపేటలో విద్యార్థుల కోసం బాత్‌రూమ్ నిర్మించాలని ఎంపీటీసీ వి.సత్యనారాయణ కోరారు. గ్రామాల్లో అక్రమ మద్యం, సారా అమ్మకాలు నిరోధించాలని పాల్తేరు, పాయకరావుపేట, శ్రీరాంపురం, పెదరాంభద్రపురం ఎంపీటీసీలు కోరారు. గోపాలపట్నం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం సక్రమంగా పని చేయడం లేదని సర్పంచ్ పన్నీరు బాబ్జి సభ దృష్టికి తీసుకొచ్చారు.

24 గ్రామాల్లో పనులు పూర్తి

సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు అధికారులు సమాధానం తెలిపారు. మండలంలో 24 గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పనులు దాదాపు పూర్తి అయ్యాయని, నాలుగు గ్రామాల్లో మాత్రమే పనులు పూర్తి చేయవలసి ఉందని కాంట్రాక్టరు పనులు చేపట్టకపోవడం వల్ల ఆలస్యమవుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కళ్యాణ్ మనోజ్ తెలిపారు. మండలంలో 3,429 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించగా, వీరిలో 705 మంది నిర్మాణాలు పూర్తి చేశారని, మిగిలిన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని హౌసింగ్ డీఈ విజేయుడు తెలిపారు. మండలంలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల కోసం నిర్మిస్తున్న 50 భవనాలు త్వరలో పూర్తి చేయనున్నట్టు పంచాయతీ రాజ్ డీఈ వై.హరి సభకు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తెలిపిన సమస్యలపై ఆయా శాఖల అధికారులు సత్వరమే స్పందించి పరిష్కరించాలని జెడ్పీటీసీ లంక సూర్యానారాయణ, ఎంపీడీవో ఎ.సాంబశివరావు ఆదేశించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి, తహసీల్దార్ కె.జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

135 ఎకరాల్లో ఉడుపులు పూర్తి



రైతులకు సూచనలిస్తున్న ఏవో ఉమాప్రసాద్

నక్కపల్లి: మండలంలో 135 ఎకరాల్లో వరి ఉడుపులు పూర్తయ్యాయని మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలో డొంకాడ, గోడిచెర్ల గ్రామాల్లో వరి ఉడుపులను పరిశీలించారు. భాస్వరం ఎరువులను దమ్ములోనే వేసుకోవాలని సూచించారు. తాడు ఉడుపుల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు.గాలి,వెలుతురు తగిలి దుబ్బు బాగా ఎదగడంపాటు దోమలు నివారించడానికి, ఎరువులు, పురుగు మందుల యాజమాన్యానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఆర్బీకేల్లో 190 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. యూరియా 130 ఎంటీ, డీఏపీ 30 ఎంటీ, ఎంవోపీ 30ఎంటీ అందుబాటులో ఉన్నట్టు తెలిపారు.

శభాష్ వలంటీర్



ఆస్పత్రిలో బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ జ్యోతి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని దోసూరుకు చెందిన వలంటీర్ జనపరెడ్డి జ్యోతి విధి నిర్వహణలో తన నిబద్ధత చాటుకున్నారు.దోసూరు పంచాయతీ పరిధిలోని రావిపాలెంకు చెందిన వృద్ధురాలు నర్మాలలక్ష్మి(70) అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు. దీంతో వలంటీర్ ఆస్పత్రికి వెళ్లి వృద్ధురాలి యోగక్షేమాలు తెలుసుకోవడంతో పాటు పింఛన్ అందజేశారు. పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ నర్మాల కుమార్,సచివాలయ కన్వీనర్ ప్రసన్నకుమార్ వలంటీర్‌ను ప్రశంసించారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు



ఆక్రమణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

ఎస్.రాయవరం: ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు పాల్పడితేకఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ విజయ్‌కుమార్ హెచ్చరించారు.తిమ్మాపురం రెవెన్యూ పరిధిలో చెరువుగట్టు ఆక్రమణలకు గురుతున్నట్టు తెలుసుకుని ఆ ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించారు.తవ్విన చెరువుగట్టును యథావిధిగా పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.శుక్రవారం కొంత మేర పూడ్చామని, మిగిలినది శని,ఆదివారాల్లో పూర్తి చేస్తామని స్థానిక వీఆర్వో తహసీల్దార్‌కు తెలిపారు. ఆక్రమణలు పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకోక తప్పదని తహసీల్దార్ హెచ్చరించారు.

లేగ దూడల ప్రదర్శన

యలమంచిలి: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో శుక్రవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఎంపీపీ బోదెపు గోవింద్ ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి రామ్‌మోహనరావు లేగ దూడల ఉత్పత్తి పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి పశువైద్యాధికారులు ఎస్. దేవరాజు,గౌతమ్ వర్మ, పి.బానుబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో రాయితీపై విత్తనాలు



కొబ్బరి మొక్కలకు జియో ట్యాగింగ్ చేయిస్తున్న వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు

కశింకోట: స్వయం సహాయక సంఘాల మహిళలకు డీఆర్‌డీఏ ద్వారా పెరటి తోటల విత్తనాలను రాయితీపై త్వరలో అందించనున్నట్లు వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని జమాదులపాలెంలో స్వయం సహాయక సంఘాల మహిళా రైతులకు రాయితీపై పంపిణీ చేసిన మేలు జాతి పండ్ల మొక్కలను శుక్రవారం పరిశీలించి, జియో ట్యాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరడు స్థలం, భూములున్న మహిళలు తమ కుటుంబానికి కావాల్సిన కూరగాయలు, ఆకుకూరలు తదితర పంటలు పండించేందుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను రాయితీపై అందిస్తామన్నారు. విత్తనాలు కావాల్సిన వారు తమ పేర్లను వీవోఏ, సీసీల వద్ద నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటికే 50 యూనిట్ల పెరటి కోళ్లను స్వయం సహాయక సంఘాలకు అందించినట్లు తెలిపారు. మేలు జాతి కొబ్బరి, జామ, సపోట, మామిడి, జీడి మామిడి, బత్తాయి, దానిమ్మ, నిమ్మ తదితర జాతులకు చెందిన మొక్కలను కడియం నుంచి రప్పించి రాయితీపై అందించామన్నారు. మొక్కల సంరక్షణకు సభ్య రైతులు తీసుకుంటున్న చర్యలను పరిశీలించి జియో ట్యాగింగ్ చేయిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీసీ రామృష్ణ, వీవోఏ కుమారి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

అనకాపల్లిటౌన్: రోజురోజుకూ పెరుగుతోన్న సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని రిసోర్స్ పర్సన్ చిగురుపాటి కిరణ్ సూచించారు. స్థానిక డైట్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీపై రెండు రోజుల వర్క్‌షాపు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల వలలో మనతోపాటు, మన తోటివారు కూడా చిక్కకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్క్‌షాపు శనివారం కూడా కొనసాగనుంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, సీఎస్ఈ విభాగాధిపతి సుజాత, అకడమిక్ కో ఆర్డినేటర్ కె.పార్వతి, స్కిల్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కను నాటి నీరు పోస్తున్న ఉదయ్‌సాగర్

అనకాపల్లిటౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద ఖాళీ స్థలాల్లో మొక్కల్ని నాటి, వాటిని సంరక్షించాలని ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ ఉదయ్‌సాగర్ కోరారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జాతీయ బీమా కార్మిక సంస్థ(ఎన్‌వోఐడబ్ల్యూ) 55వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలునాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళికి స్వచ్ఛమైన ఆక్సిజన్ కావాలంటే మొక్కలను నాటాలన్నారు. మొక్కల ద్వారానే కాలుష్య నియంత్రణ సాధ్యపడుతుందన్నారు. అంతకు ముందు కార్యాలయ ఆవరణలో 20 మొక్కలను నాటారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ రవిశంకర్, బీమా కార్మిక సంస్థ కేంద్ర కమిటీ సభ్యుడు బొడ్డేడ అప్పల నరసయ్య, ఎల్ఐసీ విశ్రాంత ఏవో మంత్రి జగదీష్, అనకాపల్లి బ్రాంచ్ ఏజెంట్స్ అధ్యక్షుడు బుద్ద శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వంట పాత్రల వితరణ

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం జెడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు సత్యసాయి భజన మండలి ఆర్థిక సాయంతో వంట పాత్రలను శుక్రవారం అందించారు. హైస్కూల్ హెచ్ఎం విజయలక్ష్మి సుమన్, ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, వైఎస్సార్ సీపీ నాయకుడు లగిశెట్టి గణేష్, స్కూల్ కమిటీ చైర్మన్ గుమ్మడి గోవింద, మాజీ చైర్మన్ గుమ్మడి శ్రీనివాస్ సమక్షంలో ఈ పాత్రలను పాఠశాలకు అప్పగించారు.

శరవేగంగా సీసీ రోడ్డు పనులు



ఎంపీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మళ్ల బుల్లిబాబు

కశింకోట: స్థానిక హౌసింగ్ కాలనీలో ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి మంజూరు చేసిన నిధులతో సిమెంట్ రోడ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. కశింకోటలో అభివృద్ధి పనులకు ఎంపీ రూ.కోటి నిధులు మంజూరు చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. కాలనీలో రూ.35 లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్ల నిర్మాణ పనుల్ని శుక్రవారం పరిశీలించారు. స్థానిక కనక మహాలక్ష్మి వీధిలోని కోటదిబ్బ నుంచి మరిడిమాంబ ఆలయం వరకు మంత్రి అమర్‌నాథ్ మంజూరు చేసిన రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్డు, కాలువ నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ నిధులతో రోడ్డు నిర్మించనున్న ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు.

త్యాగధనులను స్మరించుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి

కోటవురట్ల: 'నా భూమి–నా దేశం' కార్యక్రమం ద్వారా త్యాగధనులను స్మరించుకునేలా ప్రతి గ్రామ పంచాయతీలో మొక్కలను నాటాలని జెడ్పీటీసీ సభ్యురాలు సిద్ధాబత్తుల ఉమాదేవి కోరారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు చేపట్టనున్న నా భూమి–నాదేశం కార్యక్రమంపై సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అమరవీరులను, స్వాతంత్ర్య సమరయోధులను గుర్తించుకోవడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు దోహదపడే కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా 75 మొక్కలు నాటేందుకు స్థలాన్ని గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శింగంపల్లి అప్పలనాయుడు, ఈవోపీఆర్డీ సుబ్రహ్మణ్యం, ఏపీవో గంగునాయుడు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



పదిలో అత్యధిక మార్కులు సాధించిన వారికి నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న దృశ్యం

మునగపాక: ప్రణాళికతో చదవితే మంచి ఫలితాలు సొంతమవుతాయని తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం కుమార్ అన్నారు. తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఇటీవల జరిగిన పదవ తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు బుద్ధ పశుపతిరావు మెమోరియల్ పేరిట అతని కుమారుడు పురోగామి శుక్రవారం నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం నింపేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ సూరిశెట్టి భాస్కరరావు,ఎంపీటీసీలు కాండ్రేగుల వెంకటలక్ష్మి,మద్దాల వీరునాయుడు,వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు షేక్ ఇస్మాయిల్,దొడ్డి బాలాజీ,సచివాలయ ఎడ్యుకేషన్ వేల్ఫేర్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ కార్యక్రమం విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక: మండలంలో ఈ నెల 10న జరిగే జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ హాల్‌లో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 10న మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు,కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1నుంచి 19 సంవత్సరాల లోపు వయస్సున్న పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయనున్నట్టు చెప్పారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎంపీడీవో మన్మధరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, తహసీల్దార్ ప్రకాశరావు,వైద్యాధికారులు ఎస్తేర్‌రాణి,దుర్గా ప్రవల్లిక,ఎంఈవో వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

పోషక విలువల ఆహారంతో ఆరోగ్యం



మునగపాకలో సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న దృశ్యం

మునగపాక: పోషక విలువలతో కూడిన ఆహారంతో ఆరోగ్యంగా జీవించవచ్చని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ తెలిపారు. మునగపాక పంచాయతీ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సంపూర్ణ పోషణ కిట్లను ఆయన స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులకు ఈ కిట్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు,ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ పాలిమేర గణేష్, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. చూచుకొండలో జరిగిన సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీలో సర్పంచ్ దొడ్డి సూరప్పారావు, ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్‌కుమార్,పీహెచ్‌సీ పర్సన్ ఇన్‌చార్జి పెంటకోట హరేరామ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరైనా.. జరగని మరమ్మతులు

నిరసన వ్యక్తం చేసిన వాహనచోదకులు

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు నుంచి దార్లపూడి శివారు ఇందేశమ్మవాకకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా, పనులు చేపట్టకపోవడంపై వాహన చోదకులు, సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. కాంట్రాక్టర్ పనులు చేయకపోయినా అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. సుమారు అరగంట పాటు ట్రాఫిక్ నిలిపివేసి నిరసన తెలిపారు. నక్కపల్లి సీఐ అప్పన్న ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. వారం రోజుల్లో మరమ్మతులు చేపట్టనున్నట్టు ఉన్నతాధికారులు తెలిపారని ఆర్అండ్‌బీ వర్కు ఇన్‌స్పెక్టర్ చెప్పారు. దీంతో ఆందోళన కారులు నిరసన విరమించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.అప్పలరాజు, సత్యనారాయణ, ఆటోయూనియన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల తొలగింపు



అక్రమ కట్టడాలను తొలగిస్తున్న సిబ్బంది

అనకాపల్లి రూరల్: మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీ, తుమ్మపాల వీధిలో అక్రమ కట్టడాల తొలగింపు పనులను శుక్రవారం ప్రారంభించారు. గత 30 ఏళ్ల నుంచి ఈ వీధిలో కాలువలు, రహదారులు సరిగా లేవు. చాలా వరకు కాలువలు, రోడ్ల స్థలం ఆక్రమణలకు గురైంది. గ్రామ పంచాయతీలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు అడ్డంకిగా ఉన్న ఆక్రమణలు తొలగించాలంటూ ఇటీవల పంచాయతీ పాలకవర్గం తీర్మానించింది. ఇందుకు ప్రజలు, ఆక్రమణదారులు కూడా సహకరించడంతో సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, పంచాయతీ ఈవో శ్రీనివాసరావు నేతృత్వంలో యంత్రాల సాయంతో తొలగింపు పనులు చేపట్టారు. స్థానిక ఎంపీటీసీ పన్నీరు వెంకటలక్ష్మి, పన్నీరు చంటి, కర్రి బాబి, వార్డు సభ్యులు పర్యవేక్షించారు.

బాలికలకు సైకిళ్ల పంపిణీ

అనకాపల్లి రూరల్: మండలంలోని తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 39 మంది బాలికలకు శుక్రవారం సైకిళ్లను పంపిణీ చేశారు. రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవ, అరబిందో ఫార్మా ఆర్థిక సహకారంతో సమకూర్చిన సైకిళ్లను సర్పంచ్ తట్ట పెంటయ్యనాయుడు విద్యార్థినులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మంత్రి అమర్‌నాథ్ చొరవతో నియోజకవర్గంలో 2,500 సైకిళ్లను సమకూర్చినట్టు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేసి, అధిక నిధులను వెచ్చిస్తోందని, విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సైకిళ్లను అందుకున్న విద్యార్థినుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. మంత్రి అమర్‌నాథ్‌కు థాంక్యూ సార్ అంటూ జేజేలు పలికారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చదరం చిన్న, స్కూల్ కమిటీ చైర్మన్ గొంతిన శ్రీను, వార్డు సభ్యులు అండిబోయిన నాగరాజు, వెలగా మోదనాయుడు, ఆర్బీసీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.